

సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు

కరీంనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ స్కామ్- 2025లో భాగంగా 2,822 బ్యాటరీ, మాన్యువల్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు, 481 పవర్ స్ప్రేయర్లు, 188 రోటవేటర్లు, 32 సీడ్ కం ఫెర్టిలైజర్ డ్రిల్లర్లు, డిస్క్ హీరో, కల్టి వేటర్, కేజ్‌వీల్స్, ఎంబీ ప్లవ్, 212 రోటో పడ్లర్, 9 బండ్ ఫార్మర్, 17 పవర్ వీడర్స్ 33 బ్రష్ కట్టర్స్ 25 పవ ర్ టిల్లర్, 29 స్ట్రా బెలర్ ఉన్నాయన్నారు. చిన్న, సన్నకారు, మహిళ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50శాతం సబ్సిడీపై, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీపై ఇస్తామని తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఎయిడ్స్ నివారణ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ గురించి పూర్తి వివరాలు తెలుసుకొని అది వ్యాప్తి చెందే మార్గాలు, నివారణ చర్యల గురించి తెలుసుకోవాలన్నారు. హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తులపట్ల ఆదరణ చూపాలని, వారిపై వివక్ష చూపొద్దన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధ మాట్లాడుతూ ప్రతీ గర్భిణి తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఒకవేళ పాజిటివ్ అని తేలితే ఏఆర్‌టీ మందులు వాడాలని, తద్వారా పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవీ సోకకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సనా జవేరియా, డెమో రాజగోపాల్, సఖి కన్సల్టెంట్ లక్ష్మి, డాప్కో టీం సభ్యులు అడ్వకేట్ హేమంత, సఖి లీగల్ కౌన్సిలర్ సంధ్యారాణి, డీసీహెచ్ఎస్‌వో విమల పాల్గొన్నారు.

వడ్డీ జలగలు!

బొమ్మకల్ కృష్ణనగర్‌కు చెందిన తంగెళ్ల శ్రీనివాస్ భార్య 3 ఏళ్ల క్రితం విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఆమెకు వైద్యం కోసం 40 లక్షలు ఖర్చు అయింది. ఆ సమయంలోనే నాగరాజు అనే వ్యక్తి వద్ద శ్రీనివాస్ నాలుగు లక్షల రూపా యలు అప్పుగా తీసుకుని ఇప్పటివరకు 15 లక్షల వరకు చెల్లించాడు. ఇంకా 27 లక్షల 60 వేల రూపాయలు బాకీ ఉన్నట్లుగా నాగరాజు శ్రీనివాస్‌కు నోటీసు పంపించాడు. అప్పు కింద శ్రీనివాస్‌కున్న ఆరు గుంటల ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలని మరో వ్యక్తితో కలిసి తీవ్రంగా వేధించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాస్ ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

- సామాన్యుల 'నడ్డి' విరుస్తున్న 'వడ్డీ' వ్యాపారులు
- 10 నుంచి 20 శాతం వరకు వడ్డీ వసూలు
- అప్పు చెల్లించలేక బాధితుల ఆత్మహత్యలు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వడ్డీ వ్యాపారం కాలనాగులా పడగవిప్పి పలువురిని పొట్టన పెట్టుకుంటోంది. వడ్డీ వ్యాపారుల బారినపడి ఎందరో ఆత్మహత్యలతో అర్థాంతరంగా తనువులు చాలిస్తున్నారు. ధర్మవడ్డీ.. నూటికి ఒకటి, రెండు రూపాయల వడ్డీ అనే మాటలే వినరాకుండా పోయాయి. అంతటా అధర్మ వడ్డీనే.. నూటికి పది, ఇరవై శాతం వడ్డీ లెక్కకట్టి వసూలు చేస్తూ బాకీల బారిన పడినవారికి బతుకు లేకుండా చేస్తున్నారు. వడ్డీకి వడ్డీ కట్టి వసూలు చేస్తుండడంతో ఏడాదిలోనే తీసుకున్న అప్పు రెండింతలైపోతున్నది. అవసరాల కోసం కొందరు.... ఆపద, అత్యవసర సమయాల్లో మరి కొందరు.... అధిక వడ్డీకి అప్పులు తీసుకుంటున్నారు. వీరి బలహీనతను అక్రమ వడ్డీ వ్యాపారులు సొమ్ము చేసుకుంటూ నిలువునా దోపిడీ చేస్తున్నారు. ఈ అక్రమ వడ్డీ వ్యాపారులు తమ దందాతో చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, హమాలీలు, కార్మికులు, సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. 10 నుంచి 20 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తూ దోచుకుంటున్నారు.

● ఆస్తులు, సెల్‌ఫోన్లు, బైక్‌లు తనఖా

ఇచ్చిన అప్పులకు సెక్యూరిటీగా సెల్‌ఫోన్, బైక్‌లు, ఆస్తుల డాక్యుమెంట్లు తనఖా పెట్టుకుంటున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా డైలీ ఫైనాన్స్, నెలవారి వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్న ఒక వ్యాపారిని రెండేళ్ల క్రితం కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద వందల కొద్ది సెల్‌ఫోన్లు, భారీ సంఖ్యలో బైక్‌లు, బైక్‌ల ధ్రువీకరణ పత్రాలు లభించాయి. అతడు 75 లక్షల రూపాయలు వడ్డీకి తిప్పుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసుల విచారణలో వెల్లడైంది.

● నామమాత్రంగా చర్యలు

కొన్నాళ్ల క్రితం ఒక పోలీసు అధికారి అక్రమ వడ్డీ వ్యాపారం వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వరుసగా ఇటువంటి అక్రమ దందాలు వెలుగులోకి వస్తున్నా అధికారులు నియంత్రిచలేకపోవటం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధిక వడ్డీ వ్యాపారం కొందరు ప్రాణాలను బలితీసుకుంటుండగా మరి కొందరు కోట్ల ఆస్తులను కోల్పోతూ బజారున పడుతున్నారు. అవసరానికి ఎక్కడా డబ్బులు లభించక పోవటంతో ఎంత వడ్డీ అయినా చెల్లించటానికి సిద్ధమై అప్పుగా తీసుకున్న వారు వడ్డీ చెల్లించలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరో వైపు రోజూ కష్టపడే కూరగాయల వ్యాపారులు, పండ్ల వ్యాపారులు, ఇతర ఫుట్‌పాత్ వ్యాపారులు రోజు వారీగా తీసుకున్న అప్పుకు వడ్డీ చెల్లించడానికే వారి సంపాదన సరిపోతుంది. జిల్లాలో ఎలాంటి అనుమతి లేకుండా నడుపుతున్న వడ్డీ వ్యాపారంలో పోలీసులు, వ్యాపారులు, ఫైనాన్స్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులున్నారు.

● అడ్డగోలు వడ్డీ

రోజువారి వడ్డీ వ్యాపారంలో 10 వేల రూపాయలు అప్పుగా తీసుకుంటే ఇందులో ముందుగానే 1,500 నుంచి రెండు వేల వరకు రూపాయలు ఇస్తుంటారు. 100 రోజుల్లో రోజుకు 100 రూపాయల వంతున 10 వేలు వసూలు చేస్తున్నారు. కూరగాయల వ్యాపారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు, పండ్ల వ్యాపారులకు అప్పులు ఇచ్చి రోజువారీగా వెయ్యి రూపాయలకు 100 రూపాయల వడ్డీ వసూలు చేస్తున్నారు. పెద్ద పెద్ద వ్యాపారులు రోజు వారి వడ్డీ వ్యాపారులు లక్ష రూపాయలకు రోజుకు వంద రూపాయలు వడ్డీ వసూలు చేస్తున్నారు. రోజువారి అప్పు, 100 రోజుల అప్పులకు ఒక గ్యారంటీతో ప్రామిసరీ నోట్‌పై సంతకాలు తీసుకుంటున్నారు.

● ఖర్చులూ అప్పు తీసుకున్న వారి నుంచే వసూలు

లక్ష రూపాయలు ఆపై అప్పులకు సెక్యూరిటీగా ఇళ్లు, భూముల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు తీసుకోవడం, ఆస్తులను తనఖా, జీపీఏ లేదా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. దీనికి సంబంధించిన ఖర్చులు కూడా అప్పుతీసుకున్నవానే భరించాల్సి ఉంటుంది. వాయిదా ప్రకారం వడ్డీ, అప్పులు చెల్లించని వారి ఇంటికి తమ అనుచరులను పంపిస్తూ వారి

(మిగతా 8వ పేజీలో)

ఎరువుల కొరత రాకుండా చూడాలి



కలెక్టర్ పమేలా సత్పతితో మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి నియోజక వర్గంలో రైతులకు ఎరువుల కొరత రాకుండా చూడాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలెక్టర్ పమేలా సత్పతిని కోరారు. గురువారం ఆయన కలెక్టర్‌తో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆ యన యూరియా పంపిణీ ప్రణాళికబద్ధంగా చేపట్టాలని, అధికారులతో నిరం తరం పర్యవేక్షణ చేయించాలని కలెక్టర్‌ను కోరారు. వ్యవసాయ అధికా రులు క్షేత్రస్థాయిలో ఎరువుల దుకాణాలను తరచుగా సందర్శిస్తూ రైతు లకు ఎరువుల లభ్యత సమాచారం ఇవ్వాల్సిందిగా ఆదేశించాలన్నారు.

పద్మనగర్ పార్కు పనులు పూర్తి చేయాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



పట్టణ ప్రకృతి వనంను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పద్మనగర్ పార్కు సుందరీకరణ పనులను పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని పద్మనగర్, కట్టరాంపూర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పద్మనగర్ చౌరస్తాలో రోడ్డు ప్రమాదకరంగా మారిందని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మానేరు డ్యాం లోపల చెత్త వేయకుండా చూడాలన్నారు. కట్టరాంపూర్ నుంచి గౌతమీనగర్ వెళ్లే రోడ్డులో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈలు యాదగిరి, సంజీవ్ కుమార్, డీఈ శ్రీనివాస్, లచ్చిరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ శ్యామ్ పాల్గొన్నారు.

బాల భరోసా సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, పక్కన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే

కరీంనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బాల భరోసా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఐదు సంవత్సరాల్లోపు పిల్లల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల భరోసా కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే నిర్వహించిన సర్వేను మరొక సారి సరి చూడాలన్నారు. సర్వే సరిగా చేయక పోతే ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించలేకపోతామని, తద్వారా వారికి ప్రభు త్వం అందించే వివిధ సేవలకు దూరమవుతారని అన్నా రు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చాక ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం చేపట్టాల్సిన కార్యక్ర మాలను పక్కాగా అమలు చేయాలని తెలిపారు. భవిత కేంద్రాల్లోని ఐఆర్‌పీలు సైతం ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల వివరాలు సేకరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సాజిద, పీవో సన, సీడీపీవోలు సబిత, శ్రీమతి, నర్సింగారాణి, సుగుణ పాల్గొన్నారు.

నగరంలో ఫ్లాగ్ మార్చ్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కమిషనరేట్ పరిధిలోని మతపరంగా సున్నితమైన ప్రాంతాల్లో మేడ్చల్‌కు చెందిన 99వ రాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్) బెటాలియన్‌తో స్థానిక పోలీసులు గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం మాట్లాడుతూ ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు. నగరంలోని మూడో పోలీసు ఠాణా పరిధిలో ఫ్లాగ్ మార్చ్ సాగిందన్నారు. భవిష్యత్తులో ఏదైనా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎదుర్కోవడానికి మాక్ డ్రిల్స్ నిర్వహించారన్నారు. శాంతి భద్రతలను కాపాడటానికి ఈ కార్యక్రమం ఒక ముందస్తు చర్య అని పోలీస్ కమిషనర్ తెలిపారు.



నగరంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ టి మధుసూదన్



అధికారులతో మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ టి మధుసూదన్

గణేశ్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు సరఫరాలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టీజీ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ టి మధు సూదన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. గురువారం కరీంనగర్ టీజీ ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆ యన మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఎప్పటికప్పుడు మార్చాలని, లూజ్ కనెక్షన్లు లేకుండా జా గ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ సంస్థలతో కలిసి నగరాల్లో ఉన్న కేబుల్ వైర్లను తొలగించే చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖలోని సిబ్బంది తప్పిదాలు ప్రాణాపాయానికి దారితీసే అవకాశాలు ఉ న్నందున ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చ రించారు. వినాయకుల ప్రతిమలను తరలించే క్రమంలో విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీరు ఆపరేషన్ బి అశోక్, ఎస్ఈ మేక రమేష్‌బాబు, డీఈలు ఉపేందర్, జంపాల రాజన్, చంద్రమౌళి, తిరుపతి. ఎస్ లక్ష్మారెడ్డి, ఎస్ఏవో రాజేంద్రప్రసాద్, ఏడీలు ఎన్ అంజయ్య, జి శ్రీనివాస్, లావణ్య పాల్గొన్నారు.

వినాయక చవితికి ఏర్పాట్లు ఏవి?

అతుకుల రోడ్లు, అంధకారంలో వీధులు

- ఉత్సవాలనాటికి నగరం ముస్తాబయ్యేనా?



బోయవాడలో నిర్మాణంలో ఉన్న డ్రైన్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వచ్చేసింది. గణనాథుడికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. అసంపూర్తిగా వదిలి పెట్టిన రోడ్లు, వర్షపు నీటి గుంతలతో వినాయకుడు వీధుల్లోకి ఎలా వెళ్తారని నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. వెలగని వీధి దీపాలతో నగరంలో ఎక్కడ చూ సినా అంధకారమే దర్శనమిస్తుంది.ఈ నెల 27న వినాయక చవితి. ఆలోగా ఏర్పా ట్లు పూర్తి చేయాల్సిన అధికారులు ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలను ప్రారంభించలేదు. నగర పాలక సంస్థ నెల రోజుల ముందునుంచే ఏర్పాట్లను ప్రారంభించడం ఆనవాయితి.

● మూడు వేలకుపైగా వినాయక మండపాలు

నగరంలోని 66 డివిజన్లలో మూడు వేలకు పైగా వినాయక మండపాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి యేట వర్షాకాలంలో రోడ్లు దెబ్బతింటాయి. వాటికి పండగలోగా మరమ్మతులు చేస్తారు. నెల రోజుల ముందే నగరపాలక సంస్థ టెండర్లను నిర్వహించి కాంట్రాక్టర్లకు పనులను అప్పగిస్తారు. ఈసారి ఇప్పటి వరకు టెండర్ పిలవలేదు. ఆరు నెలలుగా నగరంలోని చాలా చోట్ల వీధి దీపాలు, జంక్షన్లలోని హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. కాలనీల్లోనే కాకుండా ప్రధాన రహదారుల్లో కూడా రాత్రి వేల చీకట్లు అలుముకుంటున్నాయి. వినాయక చవితి వరకు నగరంలోని వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేయాలని, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని నగరవాసులు కోరుతున్నారు.



వర్షపు నీటితో గుంతమయంగా ఉన్న తిరుమల్‌నగర్ రహదారి

ఏర్పాట్లను ప్రారంభించాలి..

- యాదగిరి సునీల్‌రావు, మాజీ మేయర్, బీజేపీ నాయకుడు

ఈనెల 27న వినాయక చవితి పర్వదినం ఉన్నందున వెంటనే వినాయక చవితి ఏర్పాట్లను ప్రారంభించాలి. వర్షాలకు నగరంలోని అనేక చోట్ల రోడ్లు దెబ్బతినడమే కాకుండా గతంలో ప్రారంభించి పూర్తి చేయని అసంపూర్తి రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కాలనీలకు విగ్రహాలను తరలించడం, నిమజ్జనం చేయడం కష్టం. అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టాలి. వీధి దీపాలు మార్చి వెలిగేలా చూడాలి.

గణేష్ నవరాత్రులను శాంతియుతంగా నిర్వహించాలి



కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కమిషనరేట్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు, ప్రజలు నవరాత్రులను శాంతియుతంగా జరుపుకోవాలని సీపీ గౌస్‌ఆలం సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ తరఫున ఆయన మార్గదర్శకాలను జారీ చేశారు. వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. గణేష్ ప్రతిమ ఎత్తు, మండపం ఏర్పాటు చేసే స్థలం, నిమజ్జనం తేదీ, నిమజ్జనం ప్రదేశం వంటి వివరాలను తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత, సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులు అనుమతులు జారీ చేస్తారన్నారు. అనుమతి పత్రం, క్యూ ఆర్ కోడ్, పోలీస్ సూచనలను మండపం వద్ద స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. వినాయక మండపాలకు విద్యుత్ కనెక్షన్లు విద్యుత్ శాఖ అనుమతితోనే తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. శబ్ద కాలుష్యం నివారించడానికి రెండు స్పీకర్లు మాత్రమే వాడాలని, వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరిమిత శబ్దం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండపం వద్ద ఒక వలంటీర్ తప్పనిసరిగా ఉండాలని, కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు స్పష్టంగా కనిపించేలా ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనం సమయంలో ప్రతి మండపం నుంచి కనీసం ఐదుగురు బాధ్యతగల సభ్యులు ఉండాలన్నారు. మత సామరస్యాన్ని దెబ్బతీసేలా ప్రసంగాలు లేదా పాటలు ప్రదర్శించకూడదని, పోలీస్ తనిఖీల కోసం మండపం వద్ద ఒక పాయింట్ పుస్తకం తప్పనిసరిగా ఉంచాలన్నారు. అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ద్విచక్రవాహనం కల్వర్టును ఢీకొని ఒకరి మృతి


తోట మల్లారెడ్డి(ఫైల్)

ఎలిగేడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాములపల్లి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తోట మల్లారెడ్డి(60) మృతి చెందాడు. రామడుగు మండలం వెంకట్రావుపల్లి నుంచి పెద్దపల్లి వైపు బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎస్‌ఆర్‌ఎస్‌పీ ఉప కాలువ ఎల్ పైన నిర్మించిన కల్వర్టును ఢీకొని మల్లారెడ్డి కాలువలో పడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. అటువైపు వెలుతున్న వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడి కుమారుడు రిషికేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

కోతుల దాడిలో ఉపాధ్యాయుడికి గాయాలు

హుజూరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై కోతులు దాడి చేశాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న విద్యార్థులపై కోతులు దాడి చేయడానికి ప్రయత్నించాయి. గమనించిన ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్ కర్రతో కోతులను అడ్డుకునేందుకు వెళ్లగా ఒక్కసారిగా ఆయనపై దాడి చేశాయి. దీంతో సంపత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో ఇద్దరికి గాయాలు

- ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

తంగళ్లపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆటో నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరిని గాయపర్చిన ఆటో డ్రైవర్ నెల్లుట్ల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఉపేంద్రచారి తెలిపారు. బుధవారం రాత్రి తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన అక్కెనపల్లి నాగరాజు నడుచుకుంటూ వెళ్తుండగా బద్దనపల్లి శివారులో ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో నాగరాజుతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న నాగరాజు గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడ్డ వారు ఆటోడ్రైవర్‌పై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని బొంపల్లి గ్రామం నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కోర్టులో హాజరు పరుచగా గురువారం వారికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి జరిమానా విధిస్తూ పెద్దపల్లి కోర్టు జడ్జి సునిత తీర్పు ఇచ్చినట్లు రూరల్ ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. జూలై 2020లో ఇద్దరు వ్యక్తులు నిజామాబాద్‌లోని గుర్తు తెలియని వ్యక్తి నుంచి 2 కిలోల గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ప్యాకెట్‌ను రూ. 150 నుంచి 200 వరకు బొంపల్లిలో విక్రయిండగా అప్పటి బసంత్‌నగర్ ఎస్‌ఐ జానీపాష వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇరువురిపై నేరం రుజువు కావడంతో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష, 5 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. నేరస్తులకు శిక్షపడేలా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదం రమేష్, పోలీసు అధికారులు కీలక పాత్ర పోషించారు.


కరీంనగర్‌లో మండపానికి తరలుతున్న గణనాథుడు

విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహం

ఉత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకుందాం

వినాయకుల విగ్రహాల తరలింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గణేశ్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రులు వచ్చాయంటే అందరిలో ఉత్సాహం నెలకొంటుంది. రోజురోజుకు విగ్రహాల పరిమాణం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తరలింపులో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని సంద ర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ యేడు విగ్రహాలు విద్యుత్ తీగలకు తగిలి పలువురు ప్రాణాలు కోల్పోయారు. మరి కొందరు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి విద్యుత్ శాఖ సిబ్బందికి, మండపాల నిర్వా హకులకు పలు సూచనలు చేశారు.

- విగ్రహాల ఎత్తుని బట్టి రూట్‌ని నిర్ణయించుకోవాలి. ఎక్కడైనా సమస్యలు ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి
- విద్యుత్ లైన్లకు కనీసం రెండు అడుగుల దూరం పాటించాలి. లైన్ లో ప్రవహించే విద్యుత్ సరఫరా ప్రభావం, ఇండక్షన్ రెండు అడుగుల వరకు ఉంటుంది .
- ఎత్తైన విగ్రహాల తరలింపులో మరింత అప్రమత్తంగా ఉండాలి
- మెటల్ ఫ్రేమ్‌లతో కూడిన డెకొరేషన్లను వీలైనంత వరకు తగ్గించాలి.
- మండపాలకు విద్యుత్ సరఫరా కనెక్షన్ కోసం సామాన్యులు స్తంభాలు ఎక్క వద్దు. విద్యుత్ సిబ్బంది ద్వారానే కనెక్షన్ పొందాలి.
- ఐఎస్‌ఐ మార్క్ కలిగిన ప్రామాణిక విద్యుత్ వైర్లను మాత్రమే వాడాలి. ఎలాంటి జాయింట్ వైర్లు వాడరాదు. తగినంత కెపాసిటీ కలిగిన ఎంసీబీ తప్పని సరిగా వాడాలి. ఇది విద్యుత్ ప్రమాదాల నుండి రక్షణ ఇస్తుంది.
- మండపాల్లో విద్యుత్ సంబంధిత పనులు చేసేటప్పుడు పరిసరాలను క్షుణ్ణంగా పరి శీలించాలి. విద్యుత్ వైర్లు, పోల్స్, ఇతర ప్రమాదకర విద్యుత్ పరికరాల నుండి పిల్లల్ని దూరంగా ఉంచాలి.
- ఎవరికైనా విద్యుదాఘాతం తగిలితే వారికి వెంటనే వైద్య సహాయం అందించి, ఆ ప్రమాదం గురించి దగ్గరలోని విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి.
- వైరింగ్‌లో ఎక్కడైనా లీకేజీ ఉంటే, వర్షాలు కురిసినప్పుడు తేమ వలన విద్యుదాఘాతం తగిలే అవకాశమున్నది. మండపాల నిర్వాహకులు ప్రతి రోజు తప్పని సరిగా వైరింగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఆర్టీసీ బస్సు కిందపడి ఇద్దరు విద్యార్థులకు గాయాలు


గాయపడ్డ అభిషేక్

మానకొండూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు కింద పడి ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని చెంజర్లకు చెందిన అశ్వికతేజ, అభిషేక్ పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో చదువుతున్నారు. గురువారం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో పోచంపల్లి పాఠశాల వద్ద ఆదర్శ పాఠశాలకు కేటాయించిన బస్సులో ఎక్కుతుండగా అశ్వికతేజ, అభిషేక్‌లు బస్సు వెనుక టైర్ కిందపడి తీవ్రంగా గాయపడ్డట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. 108కు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై క్రాంతికుమార్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తికి చెందిన అమ్మిగల అనిల్ సెల్‌ఫోన్ 2023 మార్చి 3న బొమ్మకల్ గ్రామంలో పోగొట్టుకున్నాడు. ఈ మేరకు బాధితుడు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ లోకేషన్‌ను గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. బాధితుడు అనిల్‌కు గురువారం కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను అప్పగించారు.

ఇల్లందకుంట : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు బాధితుడికి అప్పగించారు. ఇల్లందకుంట మండలానికి చెందిన జక్కుల దేవేందర్ ఇటీవల తన మొబైల్‌ను పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను ట్రేస్ చేసి ఎస్‌ఐ క్రాంతి కుమార్ బాధితుడికి తిరిగి అందజేశారు. ఈ మేరకు బాధితుడు దేవేందర్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరుగురి బైండోవర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడిన ముగ్గురితోపాటు అనుమానాస్పదంగా తిరుగుతున్న మరో ముగ్గురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇసుక అక్రమ రవాణా కేసులో నిందితులుగా ఉన్న గొల్లపల్లికి చెందిన కె.ఆంజనేయులు, కె.తిరుపతి, డి.సంపత్‌ను, బొమ్మకల్‌లో బుధవారం రాత్రి అనుమానాస్పదంగా తిరిగిన కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన రమేష్, ఏసు, నాగరాజును గురువారం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.74 లక్షల మోసం

- ముగ్గురు సైబర్ నేరస్థుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలకు పాల్పడుతున్న కర్ణాటకకు నాగేంద్ర ప్రసాద్, యోగేష్ కదం, సునీల్ అనే ముగ్గురు నేరస్థులను గురువారం సైబర్ క్రైం, జగిత్యాల జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గురువారం వివరాలను వెల్లడించారు. సైబర్ నేరస్థుల మాటలు నమ్మి జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల పట్టణాలకు చెందిన ఇద్దరు బాధితులు బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ పేరుతో ఆన్‌లైన్‌లో విడతల వారీగా రూ.74 లక్షలు పెట్టి మోసపోయారు. అనంతరం బాధితులు జగిత్యాల సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు.

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శికా గోయల్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా సైబర్ క్రైం డీఎస్పీ వెంకటరమణ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని నియమించారు. దీంతో కోరుట్ల సీఐ సురేష్, బుగ్గారం ఎస్సై సతీష్, సైబర్ క్రైం ఎస్సైలు కృష్ణ, దినేష్ కుమార్‌లు స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. సైబర్ మోసానికి పాల్పడిన నిందితులకు చెందిన బ్యాంక్ ఖాతాలను గుర్తించారు. నిందితులు కర్ణాటక రాష్ట్రం బెంగళూర్‌లోని శ్రీనివాసపురంకు చెందిన నాగేంద్రప్రసాద్, ఉత్తర బెంగళూర్‌లోని దశరథాళికి చెందిన యోగేష్ కదం, నార్త్ బెంగళూర్‌లోని హెన్నూర్ క్రాస్‌కు చెందిన సునీల్‌లుగా గుర్తించారు. నిందితులు బెంగళూరులో ఉన్నట్లు గుర్తించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాంకు ఖాతాలతో పాటు స్టాక్ మార్కెట్, బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ పేరుతో జరుగుతున్న మోసాలను గుర్తించారు. ముగ్గురు నిందితులు కలకత్తాలో ఓ ముఠా ద్వారా ట్రాన్‌జాక్షన్ చేస్తున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేశారు. ఇందులో నాగేంద్ర ప్రసాద్ సులువైన మార్గాల ద్వారా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో కలకత్తాలోని గ్యాంగ్ సభ్యులతో కలిసి ట్రేడింగ్ పేరుతో ఆన్‌లైన్ లావాదేవీలు చేయించి ప్రజలను మోసగించి వచ్చిన డబ్బులను ఇతర ఖాతాలకు బదిలీ చేస్తున్నట్లు గుర్తించారు. సైబర్ నేరస్థుడు నాగేంద్ర ప్రసాద్‌పై దేశ వ్యాప్తంగా 71 కేసులు నమోదైనట్లు గుర్తించారు. మొబైల్‌తో పాటు బ్యాంక్ ఖాతాల పుస్తకాలు, చెక్ బుక్కులను జగిత్యాల జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే యోగేష్ కదం, సునీల్‌లు ఇతరుల పేర్లతో బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తూ వచ్చిన డబ్బులను జల్సాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. దేశ వ్యాప్తంగా యోగేష్ కదం, సునీల్‌పై 22 కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు.

వీధి కుక్కలను చంపుతున్నారని పోలీసులకు ఫిర్యాదు

కోల్‌సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తులు వీధి కుక్కలను చంపుతున్నారంటూ స్ట్రే ఎనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అనే ఎన్‌జీఓ ప్రతినిధి ముదావత్ ప్రీతి బుధవారం రాత్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దుర్గానగర్ వద్ద కొందరు వ్యక్తులు కుక్కలను ఒక వ్యాన్‌లో తరలిస్తున్నారని, అందులో రెండు కుక్కలు చనిపోయాయని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను ఓ మాజీ కార్పొరేటర్ అడ్డుకున్నాడని ఫిర్యాదులో తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వేములవాడలో శిథిలాల తొలగింపు

- వేగవంతంగా రోడ్డు విస్తరణ పనులు


వేములవాడలో శిథిలాలను తొలగిస్తున్న యంత్రాలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే ప్రధాన రహదారి విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ. 47 కోట్లతో మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు గత రోడ్డును 80 ఫీట్లకు విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపుల 254 ఇండ్లను తొలగించేందుకు నిర్ణయించి నిర్వసితులకు పరిహారం అందజేశారు. దీంతో గత రెండు నెలలుగా భవనాలను కూల్చివేసిన శిథిలాలు, మట్టి తొలగించకపోవడంతో ఆలయానికి వచ్చే భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనుల శిథిలాలను తొలగించేందుకు రూ. 22 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను వేగవంతంగా చేపడుతున్నాడు. శిథిలాలు, మట్టిని వేగంగా తరలిస్తూ విస్తరణ పనులు చకచక నడుస్తున్నాయని పట్టణ వాసులు చెబుతున్నారు. వ్యర్థాల తొలగింపుతో రోడ్డు వెడల్పు కనిపించడంతో భక్తులు, పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మానేరు వద్ద జన సందడి


మానేరు వద్ద అహ్లాదంగా గడుపుతున్న జనం

గంభీరావుపేట, ఆగస్ట్ 21 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం వద్ద జనసందడితో కిటకిటలాడుతోంది. మానేరు ప్రాజెక్టు మత్తడి దూకుతుడటంతో సందర్శకులు వస్తున్నారు. ప్రాజెక్టు పరవళ్లను తిలకించేందుకు మానేరు పరిసరాలకు పర్యాటకులు ఉత్సాహంగా విచ్చేస్తున్నారు. దీంతో మానేరు ప్రాంతం సందర్శకులతో సందడిగా మారింది.

నీటిసంపులో పడిన ఆవు

- రక్షించిన ఫైర్ సిబ్బంది


సంపులో పడిన ఆవు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని దోబివాడలో బుధవారం రాత్రి ఓ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో ఆవు ప్రమాదవ శాత్తు పడిపోయింది. గమనించిన స్థానికులు ఆవును రక్షించేందుకు ప్రయత్నించారు. సాధ్యంకాక పోవడంతో వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బందితో పాటు ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఆవును రక్షించారు.

కారులో వచ్చి నగదు చోరీ

- బైక్ నుంచి రూ.1.9 లక్షలు దొంగిలించిన మహిళలు

జమ్మికుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు కారులో వచ్చిన ఇద్దరు మహిళలు కళ్లు మూసి తెరిచే లోపు ఓ ద్విచక్ర వాహనం నుంచి నగదు కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన పొద్దుటూరి శ్యామ్‌రెడ్డి తన భార్యతో పాటు ద్విచక్ర వాహనంపై జమ్మికుంట పట్టణానికి వచ్చాడు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1.9 లక్షల రూపాయలు విత్‌డ్రా చేసుకుని తన ద్విచక్ర వాహనం ముందు బ్యాగులో పెట్టుకున్నాడు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లి తన భార్యను ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కించాడు. అనంతరం పాత వ్యవసాయ మార్కెట్ దగ్గర ఉన్న నందిని కిరాణం ఎదుట ద్విచక్ర వాహనం పెట్టి లోనికి వెళ్లాడు. ఆ షాపులో కావల్సిన సామగ్రి లేక పోవడంతో పక్క షాపులోకి లోకి వెళ్లాడు. అందులో కావాల్సిన సామాగ్రి తీసుకున్నాడు.


సీసీ కెమెరాలో అనుమానాస్పదంగా కనిపించిన మహిళలు

అప్పటికే నంబర్ ప్లేట్ లేని ఓ కారులో ఇద్దరు మహిళలు అతడిని అనుసరిస్తున్నారు. అదును చూసి ద్విచక్ర వాహనం ముందు బ్యాగులో ఉన్న నగదును తీసుకోని ఏం తెలియనట్లు అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్లి కారు వెనుకాల సీట్లలో కూర్చున్నారు. అప్పటికే స్టార్ట్ చేసి ఉన్న కారులో పరారయ్యారు. ఇదంతా తెలియని బాధితుడు తన ద్విచక్ర వాహనం వద్దకు వెళ్లి ముందు బ్యాగును పరిశీలించగా ఖాళీగా కనిపించింది. దీంతో కంగుతిన్న అతడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.

చోరీ ఘటన సీసీ కెమెరాలో నమోదైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

గాయపడిన వ్యక్తిని కాపాడిన ట్రాఫిక్ ఎస్సై


గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్‌ఐ హరిశేఖర్

కోల్‌సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మున్సిపల్ జంక్షన్‌లో గురువారం పెద్దపల్లి నుంచి మంచిర్యాల వైపునకు వెళుతున్న రన్నింగ్ ఆటో నుంచి ఒక వ్యక్తి జారి కిందపడ్డాడు. అతనికి తీవ్ర గాయాలై ప్రాణాపాయ స్థితిలో ఉండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ హరిశేఖర్ అతన్ని హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటోను వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. మానవతా దృక్పథంతో క్షతగాత్రుడిని ఆసుపత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడిన ఎస్‌ఐ హరి శేఖర్‌ను ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ రాజేశ్వర్‌రావు అభినందించారు.

బీర్‌పూర్ పెద్దగుట్టపై వరదపాశం

- పెద్దగుట్టలో లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

బీర్‌పూర్,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):బీర్‌పూర్ మండలకేంద్రం శివారులోని శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ సమీపంలోని పెద్దగుట్టపై వెలసిన స్వామి వారికి గురువారం వరదపాసం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్దగుట్టపై వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహ స్వామికి ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో స్వామి వారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా ఆదివారం బీర్‌పూర్ గ్రామంలోని నాయకులు, రైతులు, అర్చకులు, ఆయా గ్రామాల ప్రజలు గ్రామ శివారులోని పెద్దగుట్ట వద్దకు కాలి నడకన చేరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్దగుట్ట ఆలయ చరిత్రను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా వరద పాసం నిర్వహనకు, అన్నదానం కార్యక్రమాలకు పలువురు దాతలు తమ వంతుగా ఆర్థిక సహయ హకారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పండితులు పెద్ద సంతోష్ కుమార్, మధు కుమార్, చిన్న సంతోష్ కుమార్ పాల్గొన్నారు.


బీర్‌పూర్ పెద్ద గుట్టపై వరద పాశం పోస్తున్న అర్చకులు

జాతీయస్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని షిరిడీలో ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు కరీంనగర్ జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శ్రీపాల్‌రెడ్డి, కొరిమి సంతోష్‌కుమార్, పెద్దపల్లి జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆలేటి సంపత్ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 15 సంవత్సరాల విభాగంలో ఆర్ .విష్ణువర్ధన్, ఎ.లక్షిత్ రాజ్, బి.హర్షవర్ధన్, 17 సంవత్సరాల విభాగంలో కె.అరవింద్, ఈ.శ్రీధర్, టి.రిత్విక్, టి.అవినాష్, జి.సుజిత్ కుమార్, పెద్దపల్లి జిల్లా నుంచి 15 సంవ త్సరాలు విభాగంలో ఇ.అవినాష్ రావు, అండర్-17 విభాగంలో విశ్వనాథ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా డీవైఎస్‌వో శ్రీనివాస్, ఒలంపిక్ అసోసియేషన్ బాధ్యులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, మహ్మద్ కరీం, ప్రైవేట్ పీఈటీ బాధ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, గౌతమ్ హర్షం వ్యక్తం చేశారు.


ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ..

కోనరావుపేట: జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు మండల విద్యార్థి ఎంపికైనట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ తెలిపారు. కోనరావుపేట మండలం మట్టిమల్ల గ్రామానికి చెందిన లకావత్ ఆరాధ్య ఎస్‌ఏటీజీ అకాడమీ విద్యార్థి ఈ నెల 18, 19 తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్ 15 క్రీడల్లో ప్రతిభ కనపరచగా జాతీయస్థాయి క్రీడకి ఎంపికైనట్లు తెలిపారు. పూణేలో ఈ నెల 25న జరగనున్న వాలీబాల్ క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు.


ఆరాధ్య


సాయిచరణ్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి గంగు సాయిచరణ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో పదవతరగతి చదువుతున్న సాయిచరణ్ సిరిసిల్లలో గురువారం జరిగిన పోటీలలో లాంగ్ జంప్ విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబర్చి ఎంపికయ్యాడు. ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నాడు.

రాజన్న ఆలయంలో వృద్ధుడి అస్వస్థత

● ఆసుపత్రికి తరలించిన ఆలయ ఉద్యోగులు



వృద్ధుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఆలయ ఉద్యోగులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఓ భక్తుడు అస్వస్థతకు గురయ్యాడు. రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో వస్తున్న వృద్ధుడు హఠాత్తుగా ఒక్కసారిగా అస్వస్థతకు గరయ్యాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు, ఆలయ ఉద్యోగులు అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలించారు.

ముస్లిం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

● అర్హులకు అందడం లేదని పలువురి ఆందోళన

తంగళ్లపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):మైనార్టీ ముస్లిం మహిళలకు ప్రభుత్వం కుట్టు మిషన్లు పంపిణీ కోసం గతంలో దరఖాస్తులు స్వీకరించగా గురువారం మైనార్టీ శాఖ అధికారులు అర్హులైన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో మైనార్టీ పాఠశాల అవరణలో పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తుండగా అర్హులైన తమకు ఎందుకు ఇవ్వడం లేదని కొంత మంది మహిళలు అధికారులను నిలదీశారు. ఏడాది క్రితం దరఖాస్తులు చేసుకున్నామన్నారు. మిషన్ తీసుకోవడానికి రావాలని మైనార్టీ కార్యలయం నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందించారని తెలిపారు. పంపిణీ కేంద్రం దగ్గరికి వస్తే అర్హుల జాబితాలో పేరు లేదని చెప్తున్నారన్నారు. అర్హుల జాబితాలో పేరు లేకుంటే మమ్మల్ని ఎందుకు రమ్మన్నారని అధికారుల తీరుపై మహిళలు మండి పడ్డారు. అర్హులైన తమకు కూడా కుట్టు మిషన్లు అందించాలని డిమాండ్ చేశారు. విషమయంపై వివరణ కోసం మైనార్టీ అధికారులను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా స్పందించలేదు.

PM YASASVI Scholarship 2025 యశస్వీ భవ





ఓబీసీ, ఈబీసీ విద్యార్థులకు పీఎం యశస్వీ స్కాలర్‌షిప్‌లు

● ఉన్నత విద్య కోసం రూ. రెండు లక్షల వరకు ఉపకార వేతనం

● దరఖాస్తుకు ఈ నెల 27 వరకు గడువు



చొప్పదండి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ, ఈబీసీ, సంచార జాతుల విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం యశస్వీ పథకాన్ని తీసుకువచ్చింది. ఉన్నత విద్య అభ్యసించలేని ఓబీసీ, ఈబీసీ, సంచార జాతుల విద్యార్థులకు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ అందించి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వశాఖ ద్వారా ఈ స్కాలర్‌షిప్‌లను అందజేయనుంది. స్వయం ప్రతిపత్తి, ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రెండు లక్షల వరకు స్కాలర్‌షిప్‌లు లభించనున్నాయి. హాస్టల్ వసతి ఖర్చుల కోసం ప్రతి నెల మూడు వేల రూపాయల వరకు చెల్లించనున్నారు. 2025-26 విద్యాసంవత్సరానికిగాను పీఎం యశస్వీ పథకం కింద విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

● దరఖాస్తు ప్రక్రియ ఇలా...

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులు ఎన్‌ఎస్‌పీ (నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్), ఎన్‌టీఏ, scholarships.gov.in పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఆధార్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాలి. తర్వాత విద్యార్థికి ఒక ఐడీని కేటాయిస్తారు. ఆ ఐడీ ద్వారా ఎప్పటికప్పుడు విద్యార్థి స్కాలర్‌షిప్ స్టేటస్‌ను చెక్ చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 27 చివరి తేదీకాగా, చేసుకున్న దరఖాస్తుల్లో లోపాలను సవరించుకునేందుకు సెప్టెంబరు 15 వరకు అవకాశం కల్పించారు.

● నవంబరు వరకు స్కాలర్‌షిప్‌లు మంజూరు

పీఎం యశస్వీ(పీఎం యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీం ఫర్ వైబ్రెంట్ ఇండియా) పథకం కింద టాప్‌క్లాస్ విద్యాసంస్థల ఫీజులు, హాస్టల్ ఫీజులను విద్యార్థులకు అందజేస్తారు. ఎన్ఐటీ, ఐఐటీ, నిఫ్ట్, ఐఐఐటీ, ఇష్లాతోపాటు ఇతర టాప్‌క్లాస్ విద్యాసంస్థలలో చేరే విద్యార్థులకు గరిష్ఠంగా రెండు లక్షల వరకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రెండు లక్షలలోపు ఉండాల్సి ఉంది. ఈ పథకం కింద రాష్ట్రంలోని పలు విద్యాసంస్థలకు 400కుపైగా స్లాట్‌లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. స్లాట్లు, దరఖాస్తుల ఆధారంగా నవంబర్ వరకు స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయనున్నారు. దీనికి ఎలాంటి అర్హత పరీక్ష లేదు. స్కాలర్‌షిప్‌లలో 30 శాతం బాలికలకు కేటాయిస్తారు.

వైభవంగా సామూహిక లక్ష బిల్వార్చన



పూజా కార్యక్రమంలో భక్తులు

ఓదెల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో గురువారం అర్చకులు వీరభద్రయ్య ఆధ్వర్యంలో సామూహిక లక్ష బిల్వర్చన వైభవంగా నిర్వహించారు. యేటా నిర్వహించే మాదిరిగా లోక సంరక్షణార్థమై 180మంది దంపతులతో లక్ష బిల్వార్చన నిర్వహించారు. శ్రావణమాసం విశిష్టత, బిల్వార్చన ప్రాధాన్యతను ఈ సందర్భంగా అర్చకుడు భక్తులకు వివరించారు. బిల్వార్చనతోపాటు ఏకాదశ రుద్రాభిషేకం, సహిత రుద్రాహావణం, మంగళహారతి మంత్రపుష్పం నిర్వహించారు. గర్భగుడిలో కొలువుదీరిన శేషాలింగేశ్వరునికి భక్తులు బిల్వపత్రిని సమర్పించారు. గోదావరిఖనికి చెందిన కన్నూరి రాజమల్లు,సుగుణ దంపతులు అన్నదానం నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి సదయ్య, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణంపై డీఎల్పీవో విచారణ

శంకరపట్నం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని కరీంపేట గ్రామంలో ఇంటి నిర్మాణం పై హుజూరాబాద్ డీఎల్పీవో శ్రీనివాస్ గురువారం విచారణ చేపట్టారు. కరీంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో వనపర్తి అయిలయ్య అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తుండగా గ్రామపంచాయతీ స్థలం ఆక్రమించాడని వనపర్తి హరీష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హుజూరాబాద్ డీఎల్పీవో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుదారుడు హరీష్‌తో పాటు గృహ నిర్మాణం చేపడుతున్న వనపర్తి అయిలయ్య వాంగ్మూలాలు తీసుకున్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని డీఎల్పీవో శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట ఎంపీవో ప్రభాకర్ ఉన్నారు.

24న జనహిత పాదయాత్ర

- ఉప్పరమల్యాల నుంచి గంగాధర వరకు..
- 25న ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం,
- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్న ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, మక్కాన్ సింగ్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలోని ఉప్పరమల్యాల గ్రామం నుంచి కురిక్యాల చౌరస్తా మీదుగా గంగాధర వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జనహిత పాదయాత్ర ఈనెల 24న నిర్వహిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం డీసీసీ కార్యాలయంలో మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు, అనుబంధ సంఘాలకు, పార్టీ అభిమానులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. యాత్రను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమన్వయ పరుస్తారన్నారు. 24వ తేది సాయంత్రం పాదయాత్ర తరువాత గంగాధరలో బస ఉంటుందన్నారు. 25వ తేది ఉదయం ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం, మొక్కలు నాటే కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్ పాల్గొంటారని తెలిపారు. మహిళా సంఘాలతో మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ ఇంటరాక్షన్ ఉంటుందన్నారు. అనంతరం జిల్లా ముఖ్య కార్యకర్తలతో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్ ఇష్టాగోష్టి నిర్వహిస్తారని మంత్రి తెలిపారు.

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ 24న సాయంత్రం 4 గంటలకు గంగాధర మండలంలో జనహిత పాదయాత్ర ఉంటుందన్నారు. ఈ పాదయాత్రలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తలు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముఖ్య నేతలంతా పాల్గొంటారన్నారు.

● ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు భరోసా ఇస్తూ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుని సక్షేమాన్ని అమలు చేస్తుందన్నారు. విద్యార్థులు, యువకులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. సమావేశంలో ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, ఆకుల నర్సన్న, రాజిరెడ్డి, పులి ఆంజనేయులు, శ్రావణ్‌నాయక్, దన్నా సింగ్, బోనాల శ్రీనివాస్, పొన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కవ్వంపల్లికి మంత్రి పొన్నం పరామర్శ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి రాజేశం బుధవారం అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం కరీంనగర్‌లో పరామర్శించారు. కవ్వంపల్లి రాజేశం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కవ్వంపల్లి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రజాసంఘాల జాతీయ నాయకుడు పొలాడి రామారావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఉన్నారు.



ఎమ్మెల్యే కవ్వంపల్లితో మంత్రి పొన్నం ప్రభాకర్

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

● మాస శివరాత్రి సందర్భంగా మహాలింగార్చన



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణ మాసం రద్దీ కొనసాగుతోంది. గురువారం ఉదయం ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతిరాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకున్నారు. శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకొని పరివారం దేవతాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు.

మాస శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు

శ్రీరాజరాజేశ్వర స్వామివారికి మాస శివరాత్రి సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం 5.30గంటల నుంచి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. స్వామివారికి కల్యాణ మండపంలో రుద్రహవనం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 6.05 గంటలకు అద్దాల మండపంలో మహాలింగార్చన నిర్వహించగా, ఆలయ ఈవో రాధాబాయితో పాటు భక్తులు హాజరై లింగాకృతిలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

కులధ్రువీకరణ పత్రంలో నో కరెక్షన్

● ఆప్షన్ లేకపోవడంతో అయోమయం

ధర్మారం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రంలో కరెక్షన్ ఆప్షన్ లేకపోవడంతో బాధితులు అయోమయానికి గురవుతున్నారు. గతంలో మీ సేవలో కమ్యూనిటీ అండ్ డేట్ ఆఫ్ బర్త్ పేరుతో కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చేవారు. క్యాస్ట్ సర్టిఫికెట్‌లో కులంతోపాటు పుట్టిన తేదీ వివరాలు ఉన్నా రెవెన్యూ అధికారులు కేవలం కులం సర్టిఫికెట్‌ను మాత్రమే మంజూరు చేసేవారు. దాదాపు నెల రోజుల క్రితం కుల ధ్రువీకరణ పత్రం విషయంలో డేట్ ఆఫ్ బర్త్ ఆప్షన్ తీసివేసి కేవలం కమ్యూనిటీ సర్టిఫికెట్ అని వచ్చేలా ప్రభుత్వం అప్‌డేట్ చేసింది. ఈ అప్‌డేట్ విద్యార్థులకు శాపంగా మారింది.

ఉదాహరణకు ఒక వ్యక్తి కులం సర్టిఫికెట్ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోగా అతను ఇంతకు ముందు ఎన్ని సార్లు కుల ధ్రువీకరణ పత్రం తీసుకున్నారో దానికి సంబంధించిన పూర్తి వివరాలు చూపిస్తుంది. అందులో నుంచి చివరగా తీసుకున్న సర్టిఫికెట్‌ను మాత్రమే అతను రీ ప్రింట్ తీసుకోవచ్చు కాని కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి వీలులేదు. ఇంతకు ముందు కుల ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేసుకోని వారు అప్లై చేసుకుంటే దరఖాస్తు తీసుకునేలా వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేశారు.

కొందరికి మేలు..

గతంలో దరఖాస్తు చేసుకున్న వారు తరచూ ఆఫీసు చుట్టూ తిరగకుండా వచ్చిన పాత డేటానుంచే సులభంగా కుల ధ్రువీకరణ పత్రం పొందుతున్నారు. అయితే గతంలో జారీచేసిన కులం సర్టిఫికెట్స్‌లో తప్పులు దొర్లినవారికి కరెక్షన్ ఆప్షన్ లేకపోవడంతో నానాతంటాలు పడుతున్నారు. ఇలాంటివారికి కొత్తగా దరఖాస్తుకు, కరెక్షన్‌కు అవకాశంలేక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వివిధ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు, కాలేజీ స్టూడెంట్స్, స్కాలర్‌షిప్‌కోసం అవసరమున్న వారు, కల్యాణలక్ష్మి దరఖాస్తు చేసుకునేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు కమ్యూనిటీ సర్టిఫికెట్‌కు కరెక్షన్‌ఆప్షన్ కల్పించాలని కోరుతున్నారు.



కుల సర్టిఫికెట్‌లో తప్పు సరిదిద్దాలని కోరుతున్న బాధితుడు

ఏం చేయాలో అర్థం కావడం లేదు..

- నునావత్ అరుణ్ నాయక్, (లంబడితండా బి గ్రామం)

నా పేరు నునావత్ అరుణ్ నాయక్, మాది లంబడితండా బి గ్రామం. నేను ఆర్మీకి సెలెక్ట్ అయ్యాను. నాకు వచ్చే నెలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంది. ఇంతకు ముందు తీసిన కులం సర్టిఫికెట్‌లో నాపేరు అరుణ్ నాయక్‌కు బదులు అరుణ్ అని పడింది. కొత్తగా కులం సర్టిఫికెట్‌కు మీ సేవకు వెలితే పాత సర్టిఫికెట్ వస్తుంది. పాత సర్టిఫికెట్‌ను కరెక్షన్ ఆప్షన్ లేదు అంటున్నారు. దీంతో ఏం చేయాలో నాకు అర్థం కావడం లేదు. సంబంధిత అధికారులే నాకు న్యాయం చేయాలి.

ప్రాజెక్టుల్లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

జగిత్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎస్సారెస్పీలోకి 1,39,255 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 75.709 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 49.435 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలు వలు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 29,532 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 6,500 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 651 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు మూడు, నాలుగు రోజులుగా భారీగా వరద వస్తుండడంతో గేట్లు ఎత్తి దిగువ గోదావరికి నీటిని విడుదల చేశారు. వరద తగ్గుముఖం పట్టడంతో ఈనెల న ఉదయం 6 గంటల నుంచి గేట్లు మూసి వేశారు.

● ఎల్లంపల్లికి పోటెత్తుతున్న వరద

అంతర్గాం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కడెం ప్రాజెక్టు నుంచి 3,600 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ నుంచి 26,000, వాగులు, వంకల నుంచి 47500 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉన్నందున గురువారం ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు 15 గేట్లు ఎత్తి లక్ష 16వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 19.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది..

● మంథనిరూరల్: మండలంలోని సిరిపురం సమీపంలోని సుందిళ్ల బ్యారేజీలో వరదగురువారం సాయంత్రం వరకు తగ్గుముఖం పట్టింది. బ్యారేజీ నుంచి 26 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నారు.

● గాయత్రి నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

రామడుగు: రామడుగు మండలం గాయత్రి లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ఒక పంపు ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని అధికారులు గ్రావిటీ కెనాల్‌కు విడుదల చేస్తున్నారు.

● బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి నీటితో పాటు, మూలవాగు, మానేరు ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి గురువారం సాయంత్రం వరకు 18,060 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. వరద కాలువ ద్వారా 14,800, గాయత్రి పంప్‌హౌస్ నుంచి 3,150, మూలవాగు, మానేరు వాగు ద్వారా 110 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 312.17 ఉంది. నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 15.97 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉండగా, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

● అన్నపూర్ణకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.1 టీఎంసీల నీరు ఉంది. ఎగువన ఉన్న సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ప్రాజెక్టుకు 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● ఎగువ మానేరు పరవళ్లు

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పరవళ్లు కొనసాగుతున్నాయి. పల్వంచ, కూడవెళ్లి వాగుల నుంచి వరద నీరు వస్తుండడంతో జలాశయం మత్తడి దూకుతోంది. మానేరు ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 2202 క్యూసెక్కులుగా కొనసాగుతోంది.

మంత్రివర్గ విస్తరణలో గిరిజనులకు చోటు

● ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ● ఎల్లారెడ్డిపేటలో ఉత్సాహంగా తీజ్



తీజ్ వేడుకల్లో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్, అధికారంలో గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడంతో పాటు త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో గిరిజనులకు చోటు దక్కే అవకాశాలున్నాయని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ అన్నారు. గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా తీజ్ వేడుక నిలుస్తోందన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గిరిజనులు గురువారం తీజ్ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. సిరిసిల్ల నుంచి హైదరాబాద్‌కు ఎల్లారెడ్డిపేట మీదుగా వెళ్తున్న ఆయన స్థానికంగా జరిగిన తీజ్ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగంతో కలిసి పాల్గొన్నారు. గిరిజనులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. గిరిజన యువతులు, మహిళలతో కలిసి సందడి చేశారు. గోధుమ నారు బుట్టలను ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రకృతిని ఆరాధించే పండుగ తీజ్ అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, గిరిజన నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గిరిధర్‌రెడ్డి, సూర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

●సంక్షిప్తంగా..

కరీంనగర్ కల్చరల్: నగరంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని శివాలయం, పాత బజార్ గౌరీ శంకరాలయంలో మాస శివరాత్రి సందర్భంగా పూజలు చేశారు.

●నగరంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి దేవాలయాల్లో శనివారం ఉదయం 11 గంటలకు కొబ్బరి కాయలు, పూజా సామగ్రి, స్వీట్లు, పులిహోర అమ్మకాలు, టీ స్టాల్ నిర్వహణ, చీరల పోగుకు వేలం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ అనిల్ కుమార్, ఈవో కాంతారెడ్డి తెలిపారు.

జమ్మికుంట రూరల్: రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదని కాంగ్రెస్ నాయకుడు అంబాల రాజు గురువారం ప్రకటనలో తెలిపారు.

జమ్మికుంట: పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ అన్నారు. గురువారం జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్, వృక్షశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాల యంలో వికాస తరంగిణి పట్టణ శాఖ ఆధ్వర్యంలో 16 సంవత్సరాల్లోపు పిల్లలకు స్వర్ణామృత ప్రాసన గుళికలు వేశారు.

జమ్మికుంట : జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మహిళా వసతి గృహంలో వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు

ఇల్లందకుంట: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ఇల్లందకుంట సీతారామ చంద్రస్వామి ఆలయ చైర్మన్ రామారావు గురువారం పరామర్శించారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని యజ్ఞ వరాహ క్షేత్రంలో గురువారం యజ్ఞ వరాహ స్వామి ధృవమూర్తికి ఫలరస పంచామృతాలు, ఔషధులతో అభిషేకం చేశారు.

సైదాపూర్: ఈ నెల 24న హన్మకొండ అంబేద్కర్ భవన్‌లో జరిగే ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ సభ పోస్టర్, కరపత్రాలను వరంగల్ ఉమ్మడి జిల్లా వేదిక కో కన్వీనర్ ఇంద్రసేనా ఆధ్వర్యంలో సైదాపూర్‌లో ఆవిష్కరించారు.

నిరుపయోగంగా క్రీడాప్రాంగణాలు


ఊరికి దూరంగా రంగపేట క్రీడా ప్రాంగణం

లక్షల రూపాయలు వృథా

వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి

మానకొండూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల నుంచి నైపుణ్యం గల క్రీడాకారులను వెలికితీయాలనే ఉద్దేశంతో ప్రతీ గ్రామంలో లక్షల రూపాలయలను వెచ్చించి ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను నెలకొల్పింది. ఈ క్రీడాప్రాంగణాలు ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మండలంలో 27 గ్రామపంచాయతీలుండగా నిజాయితీగూడెంలో స్థలం లేక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయలేదు. మిగతా 26గ్రామాల్లో ఒక్కోదానికి రూ.2లక్షల అంచనా వేసినప్పటికీ లక్ష రూపాయల వరకు చెల్లించారు. ఈ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బార్, ఆర్చీల నిర్మాణం ఎంతో ఆర్భాటంగా పూర్తి చేశారు. రంగపేట క్రీడాప్రాంగణం గ్రామానికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలో యువకులకు ఉపయోగపడకుండా ఉంది. శ్రీనివాస్‌నగర్ క్రీడా ప్రాంగణం గుట్టకు అనుకొని ఉంది. అక్కడ చెట్టు, బండరాళ్లు ఉండి ఆటలు ఆడుకోవడానికి అనువుగా లేకుండా పోయిందని గ్రామస్థులు వాపోతున్నారు. మిగతా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు అందుబాటులో ఉన్నా విద్యార్థులు, యువకులు ఆటలు ఆడకపోవడంతో నిరుపయోగంగా తయారయ్యాయి. ప్రతీ గ్రామానికి 16 రకాల ఆట వస్తువులు కల్గిన క్రీడాకిట్టును అధికారులు పంపిణీ చేశారు. గ్రామాల్లో పంపిణీ చేసిన కిట్లు మూలనపడడంతో యువత క్రీడా ప్రాంగణాలకు దూరమయ్యారు. దీంతో క్రీడాప్రాంగణాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

రైతులను ఆదుకోవాలి

గంగాధర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వృథాగా పోతున్న లక్షలాది క్యూసెక్కుల నీటిని చెరువుల్లోకి మళ్లించి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గురువారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి నారాయణపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలోని నారాయణపూర్ రిజర్వాయర్‌ను నింపాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల కష్టాలు పట్టించుకోరా అని ప్రశ్నించారు. నారాయణపూర్ రిజర్వాయర్‌ను నింపకపోతే రైతుల పక్షాన ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వయోవృద్ధుల ఆశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ మాట్లాడుతూ సాధారణ వ్యక్తులతోపాటు వయోవృద్ధులకి కూడా చట్టం హక్కులను కల్పించిందని, వృద్ధాప్యంలో నిరాధారణకు గురి చేస్తే కఠినమైన చట్టాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని స్వాధార్ హోంను సందర్శించారు.

సుభాష్‌నగర్ : మంకమ్మతోట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మేచినేని రామేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సీనియర్ సిటీజన్లు కోరుట్ల గంగయ్య, నాగసముద్రం బాసరయ్య, పంతం రాజేశం, నాలమడుగు శంకరయ్యను సన్మానించారు.

రుణం మంజూరులో అధికారుల జాప్యం

మానకొండూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రుణం మంజూరులో కేడీసీసీబీ అధికారులు జాప్యం చేస్తున్నారని మానకొండూర్ సింగిల్ విండో డైరెక్టర్ ఎస్. తిరుపతి ఆరోపించారు. మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని చెంజర్లకు చెందిన సుదగోని లింగయ్యకు చెందిన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని కేడీసీసీబీలో నెల క్రితం రూ. 20లక్షల రుణం నిమిత్తం మార్ట్ గేజ్ చేసినట్లు తెలిపారు. రుణం మంజూరులో సంస్థ సీఈవో సత్యనారాయణ జాప్యం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సంస్థ చైర్మన్ రవీందర్‌రావు చొరువ తీసుకొని రుణం మంజూరు చేయాలని ఆయన కోరారు. సింగిల్‌విండో డైరెక్టర్లు మాడ తిరుపతిరెడ్డి, రొడ్డ మహేందర్, కొమ్ము కరుణాకర్‌రెడ్డి, ఎడ్ల అనంతరెడ్డి, మీస సత్యనారాయణ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 11 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ టు ఏడీఈ లావణ్య తెలిపారు. నగరంలోని సంతోష్‌నగర్, భాగ్యనగర్, జ్యోతినగర్, గీతాభవన్ వెనుక వైపు ఏరియా, కార్పెంటర్ సొసైటీ, సంతోష్ మాత హనుమాన్ దేవాలయం, కొత్త లేబర్ అడ్డా, సాయిబాబా దేవాలయం, సెయింట్ జాన్స్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రాజరాజేశ్వరి క్లబ్ సభ్యులకు సన్మానం



సన్మానిస్తున్న గవర్నర్ సింహరాజు కోదండరాం

భగత్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరి క్లబ్ సభ్యత్వాలు పెంచిన సందర్భంగా క్లబ్ సభ్యులను నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో లయన్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జీ 2025-26 సంవత్సరం పదో డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ఇన్స్టలేషన్ గవర్నర్ సింహరాజు కోదండరాం గురువారం సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, కార్యదర్శి బండకిషన్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు వేల్పుల శశికళ 2025-26 సంవత్సరానికి అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మొదటి ఉప గవర్నర్ మోర బద్రేషం, రెండో ఉప గవర్నర్ గుంటుక చంద్రప్రకాశ్, ఆర్‌సీ కొల్లూరి జితేందర్, జెడ్‌సి సిరిపురం ప్రసాద్, క్లబ్ సభ్యులు నరహరి లక్ష్మి, లంబు రాజిరెడ్డి, గుండేటి రామచంద్రం, నంది మోహన్‌రెడ్డి, ఎనబోయిన సంజీవరెడ్డి, బడ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం


కల్యాణం తిలకిస్తున్న భక్తులు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీ రోడ్డు నంబరు 7లో సీతా రామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపులో భాగంగా గురువారం నిర్వహించిన కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. యజ్ఞాచార్యులు గోవర్ధనగిరి జగన్నాథాచార్యుల వైదిక బృందం ఆధ్వర్యంలో స్థాపిత దేవతా పూజలు, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేద మంత్రోరణల మధ్య కల్యాణోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు సముద్రాల విజయసారధి, ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.మాధవరావు, సభ్యులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు

హుజూరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు వర్షాల కోసం ఎదురుచూసిన అన్నదాతలు నేడు యూరియా కోసం ఎరువుల దుకాణాల ఎదుట పడిగాపులు కాస్తున్నారు. గురువారం సైదాపూర్ రోడ్‌లోని ఓ దుకా ణానికి యూరియా రాగా, రైతులు క్యూకట్టారు. కొద్దిగా యూరియా రావడంతో కొంత మంది రైతులకే యూరియా దొరకడంతో మిగితా వారు వెనుతిరిగి వెళ్లిపోయారు. ప్రస్తుతం వరి రెండో పిండి వేసే దశలో ఉంది. మెట్ట ప్రాంతాల్లో పత్తి పంటకు యూరియా అవసరం ఉంటుంది. ప్రజాప్రతినిధులు రైతులకు అవసరమైన యూరియాను తెప్పించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఎరువుల దుకాణం ఎదుట బారులుదీరిన రైతులు

జిల్లాలో సీపీఐ బలోపేతానికి కృషి

భగత్‌నగర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహాసభల స్ఫూర్తితో జిల్లాలో సీపీఐ బలోపేతానికి కృషి చేస్తామని పార్టీ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్‌లోని మేడ్చల్ జిల్లా గాజుల రామవరంలో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర ప్రతినిధుల మహాసభలో జరిగిన చర్చలో మాట్లాడారు. జిల్లాలో 16 మండలాలకు 15 మండలాల్లో పార్టీనిర్మాణం, సభ్యత్వం ఉందని, నిత్యం ప్రజా సమస్యలపై పార్టీతో పాటు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తున్నామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సీపీఐ శ్రేణులు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

శ్రీ చైతన్య అధ్యాపకుడికి డాక్టరేట్

తిమ్మాపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ అధ్యాపకుడిగా పని చేస్తున్న అక్కెపల్లి శ్రీనివాస్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసిందని శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. మిషన్ లెర్నింగ్ ఆధారిత నెట్‌వర్క్ ఇంట్రుషన్ డిటెక్షన్‌పై పరిశోధనకు పిహెచ్‌డి డిగ్రీ అందజేసినట్లు తెలిపారు.

స్ట్రీట్ ఫుడ్ మేళా

హుజూరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని మున్సిపల్ ఆధ్వర్యంలో మెప్మా విభాగంలో స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌జీ మెంబర్స్ తయారు చేసిన ప్రొడక్ట్ స్టాల్స్‌ను సందర్శించి కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మెప్మా పీడీ వేణుమాధవ్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీవాణి, మల్లేశ్వరి, అనిల్, రమాదేవి, స్వరూప, స్రవంతి, కళ్యాణి, నాజీయా తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మల వృత్తిని కబళిస్తున్న మార్వాడీలు

హుజూరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మల వృత్తిని మార్వాడీలు కబళిస్తున్నారని, తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని విశ్వకర్మ సంఘం మండలాధ్యక్షుడు తాటికొండ శ్రీనివాస్ అన్నారు. గురువారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్వాడీ చేసే వ్యాపారాలతో విశ్వకర్మల వృత్తి పూర్తిగా దెబ్బతింటోందని మండిపడ్డారు. మార్వాడీల గో బ్యాక్ ఉద్యమానికి శుక్రవారం ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు విశ్వకర్మల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో విశ్వకర్మ సంఘం నాయకులు శ్రీనివాస్, భిక్షపతి, రఘు, సత్యం, చారి, సత్యనారాయణ, లింగమూర్తి పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణ పథకం కింద అన్నదాతలకు రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించేందుకు శ్రీకారంచుట్టింది. మొదటి విడతలో కరీంనగర్ రూరల్ మండలానికి 183 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో 135 బ్యాటరీ లేక మాన్యువల్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు, 22 పవర్ స్ప్రేయర్లు, 8 రొటవేటర్లు, 1 సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్లర్లు, 13 డిస్క్ హీరో/ కల్టివేటర్/ కేజీవీల్స్/ ఎంబీ ప్లవ్/ రోటో పడ్లర్, 1 పవర్ వీడర్, 1 బ్రష్ కట్టర్, 1 పవర్ టిల్లర్, 1 స్ట్రాబెలర్ మంజూరైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

చొప్పదండి: స్మామ్ పథకం కింద సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న, సన్న కారు రైతులకు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీని, ఇతరులకు 40 శాతం సబ్సిడీపై పనిముట్లు అందజేయనున్నట్లు తెలిపారు.

తిమ్మాపూర్: చిన్న, సన్న కారు రైతులకు సబ్సిడీపై ఇచ్చేందుకు తిమ్మాపూర్ మండలానికి వ్యవసాయ యంత్రాలు వచ్చా యని ఏవో సురేందర్ తెలిపారు.

గంగాధర: నియోజకవర్గంలో రాయితీపై వ్యవసాయ పనిముట్లకు అర్హులైన రైతులు దరకాస్తు చేసుకోవాలని ఏడీఏ ప్రియదర్శిని తెలిపారు. గురువారం చొప్పదండి వ్యవసాయ శాఖ డివిజన్ కార్యాలయంలో మాట్లాడారు.

శంకరపట్నం: రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి వెంకటేష్ తెలిపారు.

జమ్మికుంట రూరల్: సబ్సిడీపై అంది స్తున్న వ్యవసాయ పనిముట్ల కోసం మండల రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ తెలిపారు.

రామడుగు: మండలానికి మంజూరైన సబ్సిడీ పనిముట్లను అర్హులైన రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

హుజూరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. గురువారం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలోని పలు సమస్యలు ప్రణవ్ దృష్టికి తీసుకురావడంతో అధికారులతో మాట్లాడి పరిష్కారిస్తామన్నారు.ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణరెడ్డి, వైద్య సిబ్బంది, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

'వడ్డీ' జలగలు

(5వ పేజీ తరువాయి)

ఖర్చులను కూడా అప్పు తీసుకున్న వారి ఖాతాలో జమ చేస్తున్నారు. ఒక్కసారి లోన్ రికవరీ కోసం వెళితే వెయ్యి రూపాయలు ఖర్చు కింద వసూలు చేస్తున్నారు. అప్పులు వసూలుకు వడ్డీ వ్యాపారులు కొందరు ఏజెంట్లను నియమించుకుని వారిని అప్పు తీసుకున్న వారింటికి ఉదయమే పంపించి ఇంటి వద్దనే మకాం వేసి, అవసరమైతే బెదిరింపులకు పాల్పడుతూ వసూలు చేస్తున్నారు. అప్పులు తీర్చలేని సమయంలో వడ్డీ వ్యాపారుల వద్ద సెక్యూరిటీగా ఉన్న గ్యారంటర్‌పై ఒత్తిడి తీసుకురావడం, అది సాధ్యంకాని సందర్భంలో ఇళ్లు, భూములను ఆక్రమించడం చేస్తున్నారు. ఇటువంటి వారిపై పోలీసులు, చిట్ రిజిస్ట్రార్ అధికారులు కఠిన చర్యలుతీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సామాన్యులను, పేదలను అక్రమ వడ్డీ వ్యాపారంతో జలగల్లా పీడిస్తున్న వారిపై ఇప్పటికైనా పోలీసులు, చిట్ రిజిస్ట్రార్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఇల్లందకుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్ అన్నారు. గురువారం ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సీజనల్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్యామల, ఏఎన్‌ఎం రోజారాణి, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు నారాయణపూర్‌పై మాట్లాడే అర్హత లేదు

గంగాధర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నారాయణ పూర్ ముంపుపై మాట్లాడే అర్హత లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురమల్ల మనో హర్, జిల్లా నాయకులు అన్నారు. గురువారం గంగాధరలో విలేకరులతో మాట్లాడుతూ నారాయణపూర్‌కు నీరు విడుదల చేయాలని కోరితే ఒక్క సంవత్సరం రాళ్లు పడి నష్టపో యామని అనుకోవాలని అన్న రవిశంకర్‌కు నిర్వాసితులపై మాట్లాడే అర్హత లేదన్నారు. నిర్వాసితులకు గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లు రూ.43 కోట్లు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు దక్కుతుం దన్నారు.

డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలి

మానకొండూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నాలుగు డ్రోన్ స్ప్రేలు అందుబాటులో ఉన్నాయని వాటిని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలో యూరియా అందుబాటులో ఉందని ఒకవేళ యూరియా అందని రైతులు నానో యూరియాలో పురుగుల మందులను కలుపుకొని తక్కువ ఖర్చుతో డ్రోన్‌ల సహాయంతో స్ప్రే చేసుకోవచ్చని అన్నారు. అవసరమైన రైతులు మానకొండూర్‌లోని వ్యవసాయ అధికారి కార్యాలయంతో పాటు సొసైటీలలో పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

గణేష్ మండపాలకు ఆన్‌లైన్ తప్పని సరి

గంగాధర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలో గణేష్ మండపాలకు తప్పని సరిగా ఆన్‌లైన్ చేయించాలని ఎస్సై వంశీకృష్ణ అన్నారు. గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. పోలీస్‌శాఖ పోర్టల్‌లో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తప్పని సరిగా వివరాలను నమోదు చేయించాలన్నారు. దీని ద్వారా భద్రత, బందోబస్తు ఏర్పాట్లకు సులువుగా ఉంటుంద న్నారు. కేవలం ఈ పోర్టల్ గణేష్ ఉత్సవ కమిటీల సమాచారం కోసమే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి అసత్య ప్రచారాలను నమ్మకూడదని ఆయన సూచిం చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని గ్రామాల్లో గణేష్ మండపాలను ఏర్పాటు చేసే గణేష్ ఉత్సవాల నిర్వాహకులకు భద్రత, బందోబస్తు దృష్ట్యా ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండల గణేష్ మండప నిర్వాహకులు పోలీస్ శాఖ వారు రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమో దు చేసుకోవాలని ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

వైద్య కళాశాలకు దేహదానం

భగత్‌నగర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని కిసాన్‌నగర్‌కు చెందిన కనకశ్రీ మల్లేశం కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు దేహం దానం చేశారు. కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు దేహదానం చేసిన మొట్టమొదటి వ్యక్తిగా నిలిచిన మల్లేశంకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తకియోద్దీన్, అనాటమి డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ భవాని గురువారం ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గతంలో వీరి కుమారుడు సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయరఘునందన్ సిరిసిల్ల ప్రభుత్వ వైద్య కళాశాలకు దేహదానం చేసిన మొట్టమొదటి వ్యక్తిగా నిలిచారు. తమ కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రజలు అవయవ దానం, నేత్ర దానం, దేహదానానికి ముందకు రావాలని మల్లేశం కోరారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి వొడితెల ప్రణవ్ పరామర్శ

హుజూరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ గురువారం పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి రాజేశం మృతి చెందగా, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గంగాధర తహసీల్దార్‌గా రజిత

గంగాధర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గంగాధర తహసీల్దార్ అనుపమను వీణవంక మండలానికి బదిలీ చేయగా అక్కడ పనిచేస్తున్న రజితను గంగాధరకు బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే బదిలీ ఉత్తర్వులు వెలువడినా తహసీల్దార్ అనుపమ కార్యాలయంలోనే గురువారం పలు రిజిస్ట్రేషన్లు చేస్తూ, విధులు నిర్వహించగా జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

కాలువలో పిచ్చి మొక్కలు తొలగించాలి

సైదాపూర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని మిడ్ మానేరు ద్వారా సాగు నీరు అందించే కాలువలలో పిచ్చిమొక్కలు మొలిచి నీరు ప్రవహించకుండా ఉందని వాటిని వెంటనే తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల కార్యదర్శి గుండేటి వాసుదేవ్‌తో కలిసి మండలంలోని మిడ్ మానేరు సాగు కాలువలను పరిశీలించారు.

27న వినాయక చవితి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న ఉదయం నుంచి రాత్రి వరకు వినాయక చవితి పూజ, 9 రోజుల (నవరాత్రులు) అనంతరం 10వ రోజు శుక్రవారం నిమజ్జనం జరుపుకోవాలని జ్యోతిష వాస్తు ఆగమ శాస్త్ర పండితుడు నమిలకొండ రమణాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 7వ తేదీన చంద్ర గ్రహణం ఉన్నందున 11 లేదా 13 రోజులు నవరాత్రి ఉత్సవాలు జరుపాలన్నది సరి కాదని పేర్కొన్నారు.

మండపాలకు ఉచిత విద్యుత్ అందించండి


వినతి పత్రం అందజేస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

గణేశ్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసే మండపాలకు ఉచితంగా విద్యుత్ అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కోరారు. కరీంనగర్ విద్యుత్‌శాఖ ఎస్ఈకి వినతి పత్రం అందజేశారు. ఈనెల 27న వినాయక చవితి పర్వదినంతో ఉత్సవాలు మొదలవుతాయని, తొమ్మిది రోజులకు అవసరమైన విద్యుత్‌ను ఉచితంగా అందించాలని కోరారు. వినాయకులు తరలి వెళ్లే రహదారులు, మండపాల వద్ద విద్యుత్ లైన్‌లతో ప్రమాదాలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, బాస సత్యనారాయణ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకట్ రెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కళ్లెం వాసుదేవ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బండ రమణ రెడ్డి, ఆనంద్, రాపర్తి ప్రసాద్, కొమురయ్య, కోలగని శ్రీనివాస్, గుజ్జ శ్రీనివాస్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలపై సమావేశం

హుజూరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మార్సీలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పీడీ, పీఈటీలతో ఎంఈవో శ్రీనివాస్ గురువారం సమావేశం నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణ తేదీలను నిర్ణయించారు. అనంతరం మాట్లాడుతూ గతేడాది మాదిరిగానే ఎస్‌జీఎఫ్ క్రీడలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. పీడీ, పీఈటీలకు సూచనలు చేశారు. ఎస్‌జీఎఫ్ మండల సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చొప్పదండి: మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు సంబంధించి తేదీలను ఖరారు చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కృష్ణ, అధ్యక్షులు మోహన్ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 2, 3న అండర్-14, 17 ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, 6న అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

గిరిజనుల సంస్కృతికి ప్రతీక తీజ్ పండుగ


తీజ్ వేడుకల్లో పాల్గొన్న వెలిచాల రాజేందర్‌రావు


వేడుకల్లో పాల్గొన్న మాజీ మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ అని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. గురువారం కోతి రాంపూర్‌లోని తీజ్ ఉత్సవాలో పూజలు నిర్వహించారు.సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో ఎల్లవేళలా గిరిజనులకు అండగా ఉంటానన్నారు. మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య, ఆకుల నరసయ్య, కన్నయ్యగౌడ్, బట్టు వర ప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబం తీజ్ పండుగ అని మాజీ మేయర్, బీజేపీ నాయకుడు సునీల్‌రావు అన్నారు. గురువారం 9వ డివిజన్, కోతిరాంపూర్‌లో బీజేపీ సౌత్ జోన్ అధ్యక్షురాలు బండారి గాయత్రి, స్థానిక నాయకులు గణేశ్, అవుదుర్తి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ గిరిజన నాయకులతో కలసి పాల్గొన్నారు.